

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 04-01-2026 | సంపుటి - 26 | సంచిక -228 | రూ : 4 | పేజీలు: 8



2లో

## అవినీతి తిమింగలాలపై ఏఐ అస్త్రం..

- అవినీతిపరుల బినామీ ఆస్తులపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నిఘా
- అవినీతి తిమింగలాల పని పడతామన్న ఏసీబీ డీజీ అతుల్ సింగ్
- మూడేళ్లలో దోషులకు శిక్ష పడేలా కొత్త లక్ష్యం నిర్దేశించుకున్న ఏసీబీ
- 2025లో రెవెన్యూ శాఖలోనే అత్యధిక అవినీతి కేసుల నమోదు
- అవినీతిపై సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి

### కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి

## సలహాలు ఇస్తారని భావించాను

- కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడారన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఆయన చెప్పినందువల్లే నదీ జలాల అంశాన్ని చర్చకు పెట్టామని వెల్లడి
- రెండేళ్లుగా కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమని వ్యాఖ్య



2లో



2లో

### రూ.35 కోట్ల విలువైన

## భూమిని కాపాడిన హైడ్రా

- కూకట్‌పల్లిలో కబ్జాదారుల నుంచి 3 వేల గజాల భూమిని కాపాడిన హైడ్రా
- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు
- రెండు పార్కుల చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు

### భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో

## రేపే తొలి టెస్ట్ ఫ్లైట్... సర్వం సిద్ధం

- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో జనవరి 4న తొలి టెస్ట్ ఫ్లైట్
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో ప్రత్యేక విమానం ఢిల్లీ నుంచి రాక
- 95 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు
- 2026 జూన్ నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రణాళిక
- ప్రపంచంలోనే అతిపెద్ద MRO యూనిట్ ఏర్పాటుకు జీఎంఆర్ గ్రూప్ సంకల్పం


2లో


2లో

### కొండగట్టు అంజన్నే

## నా ప్రాణాలు కాపాడారు

- కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న పవన్ కల్యాణ్
- విద్యుత్ ప్రమాదం నుంచి తనను కొండగట్టు అంజన్నే కాపాడారన్న పవన్
- ధర్మశాల, దీక్ష విరమణ మండపానికి భూమి పూజ
- దైవ కార్యానికి మంచి మనసుతో చంద్రబాబు ఆమోదం తెలిపారని వెల్లడి


2లో

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి

## ఇది ఘనమైన ఆరంభం

- పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో వెల్లడైన గణాంకాలు
- దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి

## కాలుష్యంలో 'హై'దరాబాద్!


2లో

- శనివారం 300 దాటిన వాయు నాణ్యత సూచీ
- కాదంటున్న సీపీసీబీ
- థర్డ్‌పార్టీ, గూగుల్ యాప్, సీపీసీబీ సూచీల్లో వ్యత్యాసాలతో అయోమయం
- ఆ గాలి పీల్చితే ప్రమాదకరమంటున్న శాస్త్రవేత్తలు

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో రేపే తొలి టెస్ట్ ఫ్లైట్... సర్వం సిద్ధం

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. విజయనగరం జిల్లాలోని భోగాపురంలో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ కోసం సర్వం సిద్ధమైంది. జనవరి 4వ తేదీ, ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఉన్నతాధికారులతో కూడిన బృందం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడకు చేరుకోనుంది. జీఎంఆర్ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ విమానాశ్రయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే సుమారు 95 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు ధృవీకరించారు. వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు విమానాశ్రయం సంసిద్ధతను అంచనా వేయడంలో ఈ ట్రయల్ రన్ అత్యంత కీలకం. ఈ కమర్షియల్ వ్యాలిడేషన్ ఫ్లైట్ ద్వారా రన్‌వే పటిష్ఠత, నావిగేషన్ సిస్టమ్స్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఈ ప్రక్రియను ఆపరేషనల్ రెడీనెస్ అండ్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌ఫర్ గా వ్యవహరిస్తారు.

**భవిష్యత్ ప్రణాళికలు, ప్రత్యేకతలు**

సుమారు రూ.4,592 కోట్ల అంచనా వ్యయంతో 2,203 ఎకరాల విస్తీర్ణంలో ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు. దీనివల్ల బోయింగ్ 777, ఎయిర్‌బస్ ఏ380 వంటి భారీ విమానాలు సైతం సులభంగా రాకపోకలు సాగించగలవు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. 2026 జూన్ నాటికి వాణిజ్య విమాన సర్వీసులను ప్రారంభించి, ఆగస్టు కల్లా పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కేవలం ప్రయాణ సౌకర్యాలే కాకుండా, ఈ ప్రాంతంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గతంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. "స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం. ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ప్రధానమంత్రి మోదీని ఆహ్వానిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, జీఎంఆర్ గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మన్ జి.ఎం. రావు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా, ఇక్కడ 500 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ ఏరోస్పేస్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇది ప్రపంచ ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీదారులను ఆకర్షిస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి ఏరోస్పేస్ హబ్‌ను సృష్టిస్తాం" అని వివరించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రతో పాటు, పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. అయితే, ఎయిర్‌పోర్ట్‌కు కీలకమైన విశాఖపట్నం-భోగాపురం ఆరు లేన్ల బీచ్ రోడ్ పనులలో జాప్యంపై కొన్ని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుసంధాన మార్గాలను త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించారు.

## అవినీతి తిమింగలాలపై ఏఐ అస్త్రం.. ఇక పని పడతామన్న ఆంధ్రప్రదేశ్ ఏసీబీ డీజీ

రాష్ట్రంలో అవినీతి తిమింగలాల పని పడతామని, వారిపై ఇప్పటికే నిఘా పెట్టామని ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్ (డీజీ) అతుల్ సింగ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అవినీతికి పాల్పడిన వారికి మూడేళ్లలోనే శిక్ష పడేలా చేసి జైలుకు పంపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. అవినీతిపరుల బినామీ ఆస్తుల డేటాను సేకరించేందుకు తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలన భవనంలో అతుల్ సింగ్ మీడియా సమావేశం నిర్వహించారు. 2025 వార్షిక నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఏసీబీ కొత్త వ్యూహాలను, లక్ష్యాలను వివరించారు. ఈ సమావేశంలో ఏసీబీ డైరెక్టర్ ఆర్. జయలక్ష్మి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతుల్ సింగ్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో కరుడుగట్టిన అవినీతిపరులపై నిఘా పెట్టాం. వారి బినామీల డేటాను ఏఐ ద్వారా సేకరిస్తున్నాం. ఈ ఏడాది అవినీతి తిమింగలాల పని పడతాం. అవినీతికి పాల్పడినవారిని మూడేళ్లలోనే జైలుకు పంపాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం," అని అన్నారు. ఐజీఆర్ఎస్ వ్యవస్థ నుంచి బినామీ ఆస్తుల రిజిస్ట్రేషన్ వివరాలు, అనుమానిత బ్యాంకు లావాదేవీలను ఏఐ ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. 2025లో రాష్ట్రవ్యాప్తంగా 115 కేసులు నమోదు కాగా, వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలోనే 19 ట్రాప్ కేసులు ఉన్నాయని డీజీ వెల్లడించారు. గతేడాది ఏసీబీ కేసుల్లో శిక్షల రేటు 46 శాతంగా ఉందని, ఇది సంతృప్తికరంగా లేదని ఆయన అంగీకరించారు. శిక్షల రేటును పెంచేందుకు, కోర్టులో సాక్షులు మాట మార్చకుండా ఉండేందుకు ఇకపై వారి వాంగ్మూలాలను మేజిస్ట్రేట్ ముందు (సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద) నమోదు చేయిస్తామని చెప్పారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని డీజీ విజ్ఞప్తి చేశారు. "ప్రభుత్వ శాఖల్లో అవినీతి కట్టడికి ఏసీబీ ప్రయత్నాలు సరిపోవు. ప్రజలూ సహకరిస్తేనే అవినీతి రాకాసిని అణచివేయగలం. పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయండి, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం" అని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064, వాట్సాప్ నెంబర్ 9440440057లను విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది రెవెన్యూతో పాటు మరో నాలుగు కీలక శాఖలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు ప్రకటించారు.

## రూ.35 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలో కబ్జాకు గురైన సుమారు రూ. 35 కోట్ల విలువైన పార్కు స్థలాలను హైడ్రా అధికారులు కాపాడారు. మొత్తం 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కుల స్థలాలను శనివారం స్వాధీనం చేసుకుని, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి భాగ్యనగర్ ఫేజ్-3 కాలనీలోని పార్కులు ఆక్రమణకు గురయ్యాయని అక్కడి సంక్షేమ సంఘం సభ్యులు 'ప్రజావాణి'లో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. సర్వే నంబర్లు 197, 200 పరిధిలో 1987లో హుడా అనుమతితో భాగ్యనగర్ ఫేజ్ 3 లేఅవుట్ ఏర్పడింది. ఇందులో రెండు స్థలాలను పార్కుల కోసం కేటాయించారు. అయితే, 2 వేల గజాల పార్కులో సగం స్థలం, ఎకరం విస్తీర్ణంలోని మరో పార్కులో వెయ్యి గజాల స్థలం కబ్జాకు గురైనట్లు అధికారులు తమ నివేదికలో గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా కమిషనర్ ఆదేశాలతో శనివారం ఆక్రమణలను తొలగించారు. ఖాళీ చేయించిన స్థలంలో 'హైడ్రా' బోర్డులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించారు. తమ కాలనీలోని విలువైన పార్కు స్థలాలను కాపాడినందుకు స్థానికులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కొండగట్టు అంజన్నే నా ప్రాణాలు కాపాడారు: పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, తనకు కొండగట్టు ఆంజనేయ స్వామిపై ఉన్న అచంచల భక్తిని మరోసారి చాటుకున్నారు. తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఉన్న ఈ ప్రముఖ పుణ్యక్షేత్రాన్ని శనివారం సందర్శించిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో జరిగిన ఓ పెను ప్రమాదం నుంచి తనను కొండగట్టు అంజన్నే కాపాడారని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో, ఈ ప్రాంతంలోనే తాను హైటెన్షన్ విద్యుత్ తీగల ప్రమాదం నుంచి అద్భుతంగా బయటపడ్డానని పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. ఆ స్వామి ఆశీస్సులతోనే తాను ప్రాణాలతో ఉన్నానని, అందుకే "కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది" అని బలంగా నమ్ముతానని తెలిపారు. అడుగడుగునా ధైర్యాన్ని, బలాన్ని ఇచ్చి నడిపిస్తున్నది కూడా ఆ అంజన్న స్వామేనని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో చేపట్టనున్న రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 96 గదులతో కూడిన విశాలమైన సత్రం, దీక్షా విరమణ కోసం ఒకేసారి 2,000 మంది భక్తులు కూర్చునేలా ఆధునిక మండపం నిర్మించనున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ ఛైర్మన్ సహకారంతో ఈ పనులు సాధ్యమయ్యాయని ఆయన వివరించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి పర్యవేక్షణలో, ఆలయ ప్రాశస్త్యం దెబ్బతినకుండా ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ఈ నిర్మాణాలను చేపట్టనున్నారు. గతంలో తన ప్రచార వాహనం 'వారాహి'కి కూడా పవన్ కల్యాణ్ ఇక్కడే ప్రత్యేక పూజలు చేయించిన విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వ సహకారంతో తెలంగాణలోని ఆలయాన్ని అభివృద్ధి చేయడం, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆధ్యాత్మిక వారధిని నిర్మించడం లాంటిదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆలయ సందర్శన అనంతరం పవన్, తెలంగాణ జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

## కాలుష్యంలో 'హై'దరాబాద్!

హైదరాబాద్ : గాలిలో నాణ్యత పడిపోవడంలో హైదరాబాద్... దేశ రాజధాని ఢిల్లీతో పోటీ పడుతోంది. కొత్త ఏడాది తొలిరోజున పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 300 వరకు చేరుకుంది. ఇది థర్డ్ పార్టీ, గూగుల్ యాప్‌లు, పరికరాల ద్వారా నమోదవుతున్న సూచీల లెక్క. కానీ సీపీసీబీ ఏర్పాటు చేసిన సూచీలలో కొత్త ఏడాది గరిష్ఠంగా 170 వరకే నమోదుకావడం గమనార్హం. సీపీసీబీ సూచించే కొలతల్లో కచ్చితత్వం లేదని కొందరు విశ్రాంత ఆచార్యులు చెబుతున్నారు. నగరంలోని 14 ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ మండలి ఏక్యూఐ పరికరాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గరిష్ఠ, కనిష్ఠ సూచీలను వెల్లడిస్తోంది. ఏక్యూఐ 100 దాటితే ముప్పు పొంచి ఉన్నట్లే. డిసెంబరులో హైదరాబాద్‌లో గరిష్ఠంగా పీసీబీ లెక్కల ప్రకారం ఏక్యూఐ 132 మాత్రమే. థర్డ్ పార్టీ యాప్‌లలో నమోదైన ఏక్యూఐ 270 వరకు ఉంది. ఇంత వ్యత్యాసం ఉండకూడదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలి నాణ్యతను యురోపియన్ ప్రమాణాల మేరకు కొలిచే యంత్రాల ధర ఒక్కొక్కటి దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుంది. పీసీబీ వాడుతున్న పరికరాలు ఆ స్థాయిలో లేవని పరిశోధకులు చెబుతున్నారు.

**మూడు రకాల గాలి కాలుష్యం**

గాలిలో కాలుష్యాన్ని బయో, ఫిజికల్, కెమికల్ రియాక్టివ్‌లని మూడు రకాలుగా పరిగణనలోకి తీసుకుంటారు. గాలిలో తేమ, బ్యాక్టీరియా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యర్థాల వాసనలన్నీ మొదటి రకంలోకి వస్తాయి. సూక్ష్మ ధూళి కణాలను రెండో రకంలోకి తీసుకుంటారు. రసాయన ప్రభావం కల్గించే కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్, మిథనాల్, బెంజిన్ తదితరాలను కెమికల్ రియాక్టివ్‌లో తీసుకుంటారు. ఇవన్నీ ప్రమాణాలను దాటితే ప్రజలకు ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటివి సోకుతాయి.

* **నిత్యం రోడ్డెక్కుతున్న 50 లక్షల వాహనాలు!**

హైదరాబాద్‌లో దాదాపు 80 లక్షల వాహనాలుంటే.. రోజూ సగటున 50 లక్షల వరకు రోడ్డెక్కుతున్నాయి. వీటి నుంచి వెలువడే పొగ గాలి నాణ్యతను ప్రభావితం చేస్తోంది. వీటితోపాటు భవన నిర్మాణాలు, చెత్తాచెదారం, మురుగు, పరిశ్రమల నుంచి వెలువడే ఘాటు వాసనలు వాయునాణ్యతను క్షీణింపచేస్తున్నాయి.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభం

పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్-డిసెంబర్ 2025) దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను దక్కించుకుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా తన తాజా ఆర్థిక నివేదికలో వెల్లడించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (CMIE) డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మేగజైన్ ఓ కథనం వెలువరించింది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. "ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త, కొత్త సంవత్సరానికి ఘనమైన ఆరంభం. మా ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల ప్రభావాన్ని, ప్రత్యేకించి, సకాలంలో మరియు పారదర్శకంగా ప్రోత్సాహకాల పంపిణీ కోసం ఎస్క్రో-ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం, అలాగే స్పష్టమైన, రంగాల వారీ విధానాలను ప్రవేశపెట్టడం వంటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కార్యక్రమాల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంపై నమ్మకముంచి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఇన్వెస్టర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఈ తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తర్వాత ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ మూడు రాష్ట్రాలు కలిపి దేశంలోని మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో 51.2 శాతం వాటాను ఆకర్షించడం గమనార్హం.

## సావిత్రి బాయి పూలే జయంతి ..చంద్రబాబు, లోకేశ్ నివాళి

దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా ఘన నివాళి అర్పించారు. మహిళలను విద్యావంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆనాడు సమాజ కట్టుబాట్లను ధిక్కరించి ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మహిళల విద్యకే పరిమితం కాకుండా, పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసుకునే స్థాయికి మహిళలను తీసుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఆమె చూపిన దారిలోనే నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజంలో సగభాగమైన మహిళల విద్యాభివృద్ధిలో సావిత్రిబాయి పూలే కీలక పాత్ర పోషించారని సీఎం గుర్తు చేశారు. అందుకే ఆధునిక మహిళలు ఆమెకు సదా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యకు వెలుగులు నింపిన సావిత్రిబాయి పూలేకు మరోసారి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ట్వీట్‌లో తెలిపారు.

* **దేశ మొట్టమొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే .. లోకేశ్**

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే మన దేశ మొట్టమొదటి మహిళా టీచర్ అని, స్త్రీ విద్య, హక్కుల సాధన కోసం జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారన్నారు. సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారని, నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆమె మార్గదర్శి అనీ అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి అని లోకేశ్ పేర్కొన్నారు.

## త్వరలో ట్యాంక్‌బండ్‌పై పూలే దంపతుల విగ్రహాలు

* **సావిత్రిబాయి జయంత్యుత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి**

రవీంద్రభారతి: అధికారపక్షంలో ఉన్నా, మంత్రిగా ఉన్నా వెనకబడిన జాతుల వెంట నడుస్తానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సావిత్రిబాయి పులే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. త్వరలో ట్యాంక్‌బండ్‌పై జ్యోతిరావు పులే, సావిత్రిబాయి పులే దంపతుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని, జిల్లా, మండల, గ్రామాల్లోనూ వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ ఐకాస ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, నూతి శ్రీకాంత్,



బాలలక్ష్మి, గుజ్జ కృష్ణ, మణిమంజరి, మీనగ గోపి బోయి, బెల్లం మాధవి, ఇందిరా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇస్తారని భావించాను: సభలో రేవంత్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడితే, ఆయన సభకు వచ్చి రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు ఇస్తారని భావించానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నదీ జలాలపై కేసీఆర్ మాట్లాడిన వెంటనే అసెంబ్లీలో చర్చకు పెట్టామని, కానీ ఆయన మాత్రం సభకు రాలేదని అన్నారు. శాసనసభలో 'నీళ్లు-నిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో భాగంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. కృష్ణా నది ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత పదేళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం జరిగిందని తెలిపారు. అందుకే అనుభవం కలిగిన నాయకుడిగా కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు చేస్తారని భావించానని అన్నారు. బయట సభల్లో, కార్యాలయాల్లో మాట్లాడే మాటల కంటే అసెంబ్లీలో మాట్లాడే మాటలకు విలువ ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అవమానించినా కాంగ్రెస్ నేతలు సభకు వచ్చి మాట్లాడేవారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో మాట్లాడకపోతే అంతిమంగా ప్రజలకే అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కృష్ణా జలాలపై చర్చను తెరపైకి తెచ్చిందే కేసీఆర్ అని గుర్తుచేశారు. కానీ ఆయనకు చట్టసభలంటే చిన్నచూపు అని విమర్శించారు.

# ఏసీబీ వలలో అటవీ రేంజర్

* రూ.3.50 లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా అరెస్ట్






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్ఎసీ) పరిధిలో పనిచేస్తున్న ఓ రేంజర్ స్థాయి అధికారి ఏసీబీ వలలో చిక్కారు. కొత్తగూడెం అటవీ విభాగానికి చెందిన ఈ అధికారి ఓ వ్యక్తి నుంచి రూ.3.50 లక్షల లంచం స్వీకరిస్తున్న సమయంలో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ నేతృత్వంలోని బృందం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటనతో అటవీ శాఖలో తీవ్ర కలకలం రేగింది. అటవీ అనుమతులు, పనుల మంజూరు, ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్టు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా ముందస్తు ప్రణాళిక రూపొందించిన ఏసీబీ అధికారులు వలపన్ని, నగదు స్వీకరిస్తున్న క్షణంలో దాడి చేసి అధికారిని అదుపులోకి తీసుకున్నారు.

# ఇది ఢిల్లీ కాదు... కొత్తగూడెమే!

* రహదారులు మంచుమయం..
* వాహనాదారులు అయోమయం







ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంఊ శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచుతో కప్పబడింది. ఢిల్లీని తలపించే స్థాయిలో పొగమంచు కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పొగమంచు ప్రభావం కొనసాగుతుండగా, ఉదయం 9-10 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో జనజీవనం మందగించింది. తెల్లవారుజాము నుంచే ఎదురుగా ఉన్న మనిషి కూడా కనిపించని స్థాయిలో పొగమంచు ఏర్పడింది. జాతీయ, రాష్ట్ర రహదారులు మంచులో మాయమవడంతో వాహనాల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు అప్రమత్తంగా, నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం వేళలో సింగరేణి కార్మికులు డ్యూటీకి వెళ్లే సమయంలో లైట్లు వేసుకొని ప్రయాణం చేయాల్సి వచ్చింది. పొగమంచు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచించారు.

# ప్రతి కాలనీలలో ఉచిత మెడికల్ క్యాంప్ లు నిర్వహించాలి

: డా. రాధిక లెళ్ళ



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి కాలనీ, బస్తీలలో ఉచిత మెడికల్ క్యాంప్ లు నిర్వహించాలని ప్రముఖ ఆక్యుపంక్చరిస్ట్ డా. రాధిక లెళ్ళ ఎమ్.డి అన్నారు.శనివారం చింతల్ లోని శ్రీ సాయి కాలనీ యోగా హల్ లో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్ కు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని సుమారు 60మందికి పరీక్షలు నిర్వహించామని, అవసరమున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనకు తెలియని హెల్త్ ప్రాబ్లమ్స్ ఉంటే తెలుస్తాయని, వెంటనే హెల్త్ ప్రికాషన్స్ తీసుకోవచ్చని తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, ఇది మూడో క్యాంప్ అని అన్నారు. వాసన్ హాస్పిటల్ వారు ఐ చెకప్, హియర్ జాప్ హియరింగ్ టెస్ట్, మెడికవర్ హాస్పిటల్ ఆద్వర్యంలో బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు, ఉషారాణి నాచ్యురోపతి క్లినిక్ వారి అధ్వర్యంలో ఆక్యుపంక్చర్, యోగ ముద్రలు నేర్పించామని తెలిపారు. అనంతరం సుమారు 350 మంది భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు శ్రీ సాయి కాలనీ ఆలయాల చైర్మెన్ , అన్నప్రసాద ట్రస్ట్ చైర్మెన్ కన్నెకంటి లక్ష్మన్, శ్రీ సాయి కాలనీ ప్రసిడెంట్ కన్నెకంటి మల్లేష్ కుమార్, కళ్యాణ్ రావ్ పాటిల్, చిరంజీవి, బాలజీ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ గౌడ్, కర్ర వాణి, స్రవంతి, ఉమాపార్వతి, సత్యవతి, శిరీష, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో ఫొటో సిమిలర్ ఎంట్రీలు గడువులోగా పూర్తి చేయాలి

* రాష్ట్ర ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి ఆదేశం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్)లో భాగంగా చేపడుతున్న ఫోటో సిమిలర్ ఎంట్రీల ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో, ఐడీఓసీ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత, ఖచ్చితత్వం సాధించడంలో ఎస్ఐఆర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఫోటో సిమిలర్ ఎంట్రీలను బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలను సరిచేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**రోజువారీ పురోగతి సమీక్ష**

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అన్ని దశలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫోటో సిమిలర్ ఎంట్రీలకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేపట్టి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అర్హులైన ఓటర్ల వివరాలను సరిచేయాలని తెలిపారు. మ్యాపింగ్, ఫీల్డ్ వెరిఫికేషన్, డేటా అప్‌డేషన్ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, రోజువారీ పురోగతిని సమీక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# పదవులకంటే ప్రజలే ముఖ్యం

* అసెంబ్లీకి రానివారు రాజీనామా చేయాలి
* సిపిఐ నేత నారాయణ

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ వందేళ్ల సుదీర్ఘ పయాణంలో పార్టీ ఎన్నో ఒడిదుడుకులను చవిచూసిందని, రానున్న నవయుగం కూడా అజరామరమే అని, పదవులకంటే ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధానం అని సిపిఐ సీనియర్ నాయకులు, జాతీయ పార్టీ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ డా.కే నారాయణ అన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాల్లో భాగంగా ప్రచార జాతాను చర్ల మండల కేంద్రం లో సిపిఐ జెండా ఊపి ఆయన ప్రారంభించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక పార్టీ కార్యాలయం నుండి వేలాది మందితో డప్పు వాయిద్యాలు కొమ్ము నృత్యాల నడుమ సభా ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం, పేదలు బడుగు బలహీన వర్గాల పక్షాన సిపిఐ నాటి నుండి నేటి వరకు అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భారత స్వతంత్రానికంటే ముందే ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర భారత వని కోసం ఎందరో కమ్యూనిస్టు యువ కిషోరాలు ప్రాణ తర్పణం చేశారాన్నారు. నేడు దేశంలో అమలవుతున్న అనేక చట్టాలు కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమే అని, పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా పేర్లు మారుస్తుందని మండిపడ్డారు. ఆర్ ఎస్ ఎస్, జన సంఘ్ లాంటి మతోన్మాద శక్తులు దేశ ప్రజల శ్రేయస్సు కోసం ఏమైనా చేశాయా అని ప్రశ్నించారు. దేశ ఐక్యత కోసం పాటు పడేది కమ్యూనిస్టులే అన్నారు. కమ్యూనిస్టులను నేడు అనేకమంది విమర్శిస్తున్నారని, కమ్యూనిస్టు పార్టీని విమర్శిస్తే సూర్యునిపై ఉమ్ము వేసిన చందంగానే ఉంటుందని చెప్పారు. గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలిసిపోతున్నాయని ఆ సమస్యను ఇరు ముఖ్యమంత్రులు పరిష్కరించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో భద్రాచలానికి చెందిన ఐదు గ్రామపంచాయతీలను ఆంధ్రాలో విలీనం చేశారని, ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన కారణంగా సరిహద్దులు గజిబిజిగా ఉన్నాయని వాటిపై పాలకులు మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయకులు అలిగి అసెంబ్లీకి రావడం లేదని, ప్రజా ధనంతో జీతభత్యాలు తీసుకుంటూ విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్న వారు చట్టసభలోకి రాకపోవటం అన్యాయమని, అలాంటివారు వారి పదవులకు రాజీనామా చేయటం మంచిదని చెప్పారు. త్వరలో జడ్పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, గెలుపే లక్ష్యంగా బలంగా పనిచేయాలన్నారు. ఈ నెల 18న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభ జరగనుందని, ఈ సభకు దేశ నలుమూలల నుండి ప్రతినిధులు తరలి వస్తున్నారని, ముగింపు సభ విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున కదలాలని పిలుపు నిచ్చారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి మున్నా లక్ష్మీ కుమారి, వీషంశెట్టి పూర్ణచంద్రరావు, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, రేసు ఎల్లయ్య, కందుల భాస్కర్, ఫయుమ్, అడ్డగర్ల తాతాజీ, నూప తిరుపతి, పోతయ్య, పాల్వంచ రామారావు, కోటి ముత్యాలరావు చల్లా లక్ష్మీనారాయణ నాని పల్లి భద్రం, పొడియం ఆదిలక్ష్మి, మల్లం నాగేశ్వరరావు, పాలెం సత్యనారాయణ, ఎస్.కె జాకీర్, కాకర్ల అన్నపూర్ణ, ఉప్పులూరి వెంకట నరసమ్మ, కోడిరెక్క రాజా రావు, సర్పంచ్లు నూపా సునీత, శ్యామల తిరుపతి రావు, ఉప సర్పంచ్ లు తది తరులు పాల్గొన్నారు.



# ఫెస్టివ్ సెసన్ 2
# లైఫ్ స్టైల్ అండ్ ఫ్యాషన్ ప్రారంభం

మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బోడుప్పల్ సర్కిల్, మేడిపల్లి ప్రాంతంలో గల ఎంకెబీఆర్ కన్వెన్షన్ హాల్ నందు పోరెడ్డి కవిత రెడ్డి, చిలుముల రజిత రెడ్డి ఆధ్వర్యంలో వి4 ఈవెంట్స్ వారు నిర్వహించిన ఫెస్టివ్ సెసన్ 2. లైఫ్ స్టైల్ అండ్ ఫ్యాషన్ కార్యక్రమం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, షాపింగ్‌ను ఒకే వేదికపై అందిస్తూ ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని సృష్టించింది. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు స్థానిక వ్యాపారాలకు, మహిళలకు ప్రోత్సాహంగా నిలుస్తాయని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ వివిధ రకాల ఫ్యాషన్ స్టాల్స్, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులు, హ్యాండ్‌మేడ్ ఐటమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని జనవరి 3, 4 రెండు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని షాపింగ్ చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, సామల సందీప్ రెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు, బాలరాజు, యాసరం శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, సతీష్ గౌడ్, జగన్ రెడ్డి, వరికల్ శ్రీనివాస్, మల్లం వెంకటేష్ గౌడ్, కిరణ్ నాయక్, బత్తుల కిరణ్, పాశం నరేందర్ రెడ్డి, బుల్లెట్ శంకర్, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# బస్సు సమస్యను పరిష్కరించాలని ఆర్ ఎం కు వినతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: దండు మల్కాపురం గ్రామంలో నెలకొన్న ఆర్టీసీ బస్సు సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని కాచిగూడ లో రీజనల్ మేనేజర్ సుధా ప్రమీలకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిర్కాటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ మల్కాపురం గ్రామంలో ఆర్టీసీ బస్సుల సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామము నుంచి బస్ లు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాత్రిపూట గ్రామ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన రీజనల్ మేనేజర్ అతి త్వరలో దండు మల్కాపురం గ్రామానికి బస్సులు వచ్చే విధముగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్త ఐలమ్మ లింగయ్య యాదవ్, సుంకరి విజయ్ గౌడ్, పొట్లపల్లి శివశంకర్ గౌడ్, సంగెం నర్సమ్మ చంద్రయ్య, ఒంటెద్దు లక్ష్మమ్మ, దండు మల్కాపురం బీఆర్ఎస్ గ్రామ కన్వీనర్ ముదిగొండ వెంకటేష్, రామలింగేశ్వర స్వామి మాజీ చైర్మన్ కలగోని శ్రీధర్ గౌడ్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ సీనియరు నాయకులు సోమ శ్రీధర్, మహంకాళి లక్ష్మయ్య, జినుకల అంజి, కొయ్యడ పరుశురాం, సిగ మహేష్ గౌడ్, జొన్నగంటి మల్లేష్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ అండ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ట్రస్ట్ కార్యదర్శి ఎంఏ ఖయ్యూం అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బత్తుల శ్రీహరి కుమారుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ రావుల మాధవరెడ్డి సహకారంతో ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మాతో కలిసి శనివారం శ్రీహరికి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బీసీ కాలనీకి చెందిన పల్సం యాదయ్య మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ తో కలిసి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యకర్తలు కష్ట కాలంలో ఉంటే ఆదుకోవడానికి రాజీవ్ స్మారక్ ట్రస్ట్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నల్ల నర్సింహ్మా, వార్డు సభ్యులు రాచకొండ భార్గవ్, ఐతరాజు లింగస్వామి, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ కళ్లెం బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోడిపందాల స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ శివార్లలో కోడిపందాల స్థావరంపై దాడి చేసి 09 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు.విశ్వసనీయ సమాచారంతో కోడిపందాల స్థావరంపై దాడి చేసి నిందితుల వద్ద నుండి 17 వేల రూపాయలు,08 సెల్ ఫోన్లు,08 బైకులతో పాటు పందాలకు ఉపయోగించిన ఏడు కోళ్లను,12 కత్తులను స్వాదీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ వివరాలను తెలిపారు.పట్టుబడిన నిందితులను బూర్గంపాడు పోలీసులకు అప్పగించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా,పేకాట,కోడిపందాలు,బెట్టింగులు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# వీళ్లు 'మామూలో'ళ్లు కాదు.. ఏసీబీ వలలో ఫారెస్ట్ సిబ్బంది

కొత్తగూడెం: భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ ఇద్దరు ఫారెస్ట్ సిబ్బంది దొరికిపోయారు. భద్రాద్రి కొత్తగూడెంలో రూ.3.51 లక్షలు లంచం తీసుకుంటుండగా టీఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్ తాడి రాజేందర్‌తోపాటు చెన్నారావు అనే వ్యక్తిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జామాయిల్ కటింగ్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు చెల్లింపుల కోసం తమకు లంచం ఇవ్వాలని కాంట్రాక్టర్లను డివిజనల్ మేనేజర్ శ్రావణి డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్లు ఏసీబీని సంప్రదించారు. పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. శ్రావణి తరపున లంచం తీసుకుంటుండగా ఇద్దరినీ అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

**టన్నుకు అంత ఇవ్వాల్సిందే..**

జామాయిల్ చెట్ల కటింగ్‌కు సంబంధించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లిస్తూ ఉంటుంది. వాటికి బిల్లులను ఫారెస్ట్ అధికారులు అప్రూవ్ చేయాల్సి ఉంటుంది. ఇదే అదనుగా డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణి కాంట్రాక్టర్లపై లంచం కోసం ఒత్తిడి తెచ్చారు. మొత్తం 32వేల టన్నులకు సంబంధించి కటింగ్ బిల్లులు రావాల్సి ఉంది. టన్నుకు ప్రభుత్వం రూ.750 చొప్పున చెల్లిస్తుండగా.. అందులో తమకు టన్నుకు రూ. 150 ఇవ్వాలని ఫారెస్ట్ సిబ్బంది డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు





తెలిపారు. చివరికి టన్నుకు రూ.90 ఇచ్చేందుకు డీల్ కుదిరింది. అందులో తొలి విడతగా 3,900 టన్నుల కటింగ్ బిల్లులను అప్రూవ్ చేసేందుకు రూ.3.51 లక్షలు ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులు డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్లు నేరుగా ఏసీబీని సంప్రదించారు. రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ నేతృత్వంలో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే, డివిజనల్ మేనేజర్ శ్రావణి రాకుండా.. ఆమెకు బదులు మరొకరిని పంపించారు. ప్లాంటేషన్ మేనేజర్ రాజేందర్‌తోపాటు చెన్నారావును ఏసీబీ అరెస్ట్ చేసింది. వీరిద్దరిని ఏ2, ఏ3గా పేర్కొన్న ఏసీబీ.. శ్రావణి పేరును ఏ1గా చేర్చింది.

## ఎమ్మెల్యే కూనంనేని
# బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

**: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కూనంనేని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కిషన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమన్న కేంద్రమంత్రి.. ప్రధానమంత్రిపై వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ దీనిపై జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

## 'అన్నంలో విషం కలిపి చంపేయండి'..
# హాస్టల్ వార్డెన్ ఆడియో సంభాషణ వైరల్

సిర్గాపూర్: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ కిషన్ నాయక్ విచక్షణ మరిచారు. విద్యార్థులు తనపై ఫిర్యాదు చేశారనే కోపంతో రగిలిపోయాడు. వసతి గృహం సిబ్బందికి ఫోన్ చేసి.. 'నా మీదనే ఫిర్యాదు చేస్తారా? వాళ్ల అన్నంలో విషం కలిపి చంపేయండి' అంటూ హుకుం జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. వార్డెన్ కిషన్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ అదేశాలు జారీ చేశారు.

**ఏం జరిగిందంటే...**

వార్డెన్ కిషన్ నాయక్ తీరుతో విసిగిపోయిన వసతి గృహంలోని విద్యార్థులు గురువారం రాత్రి రోడ్డెక్కారు. కడ్పల్ సిర్గాపూర్ రహదారిపై బైఠాయించి వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న స్థానిక ఎస్సై




మహేశ్, సర్పంచి శ్రీనివాసరావు విద్యార్థులకు నచ్చజెప్పారు. వసతి గృహానికి వచ్చిన ఏఎస్ డబ్ల్యూవో చందా శ్రీనివాస్‌కు వార్డెన్ తీరుపై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న కిషన్ నాయక్... శుక్రవారం ఉదయం మద్యం మత్తులో వసతి గృహానికి వచ్చి పిల్లలను అసభ్య పదజాలంతో దూషిస్తూ రెచ్చిపోయారు. వసతి గృహం సిబ్బందికి ఫోన్ చేసి అన్నంలో విషం కలిపి విద్యార్థులను చంపేయమని హుకుం జారీ చేశారు. ఈ ఫోన్ సంభాషణ బయటికి రావడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

## 'ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా'..
# కాంగ్రెస్ 'పీపీటీ'లపై ప్రశాంత్‌రెడ్డి విమర్శలు

హైదరాబాద్: గతంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పీపీటీ ఇస్తే కాంగ్రెస్ నేతలు రాలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పీపీటీ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధమని కాంగ్రెస్ నేతలు అప్పుడు లేఖలు రాశారని గుర్తుచేశారు. ఆ లేఖలో ఉత్తమ్, భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడేమో మంత్రి ఉత్తమ్ పీపీటీ ప్రజెంటేషన్ ఇస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా ప్రవర్తిస్తున్నారని చెప్పారు.



బీఆర్ఎస్‌కు పీపీటీ అవకాశం ఇవ్వాలని కోరితే బీఏసీలో తిరస్కరించారన్నారు. మంత్రి ఉత్తమ్ పీపీటీ ఇస్తే.. తమకూ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

* **కాంగ్రెస్ అనైతిక విధానాలు: హరీశ్‌రావు**

కాంగ్రెస్ ప్రభుత్వం అనైతిక విధానాలు అవలంబిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంప్రదాయాలు అంటూ నీతులు చెప్పిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. "అసెంబ్లీలో ప్రజెంటేషన్ ఇస్తే సభకు హాజరుకాబోమని గతంలో ఉత్తమ్ చెప్పారు. ఆడియో, విజువల్ ప్రజెంటేషన్ ఇవ్వడం సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. ఇప్పుడేమో ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధపడ్డారు" అని అన్నారు.

## 'పాలమూరు' మోటార్‌ను
# కేసీఆర్ ఆన్ చేసిన తెల్లారే.. ఆఫ్ చేశారు: ఉత్తమ్

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. "కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో



మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చింది" అని ఉత్తమ్ వివరించారు.

* **ఏపీ తరలిస్తుంటే చూస్తూ కూర్చున్నారు..**

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చూస్తూ కూర్చుంది. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 202425 సీజన్‌లో కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉంది" అని ఉత్తమ్ తెలిపారు.

## ఆటో డ్రైవర్లను అక్రమంగా
# అరెస్టు చేయడం సరికాదు: కేటీఆర్



హైదరాబాద్: హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల ఐకాస నేతలు, వేలాది మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని ఆరోపించారు. వేలాది మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రశ్నిస్తే, నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలు, ఆటో అన్నలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన ఇవాళ అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే.. వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

# హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో చర్చ!

తెలంగాణ శాసన సభా సమావేశాల్లో సోమవారం నాడు హిల్ట్ పాలసీపైన చర్చ జరుగనున్నది. షార్ట్ డిస్కషన్‌లో ఈ అంశంపై చర్చను చేపట్టనున్నట్లు సమాచారం. ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ పాలసీపైన సమగ్ర చర్చను సభ చేపట్టనున్నది. శాసన మండలి కూడా సోమవారం సమావేశం కానున్నది. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో ఇప్పటికే కీలకమైన బిల్లులు ఆమోదం పొందాయి. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపైన శనివారం మంత్రి ఉత్తమ్



కుమార్ రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ అంశంపైనా సభ సుదీర్ఘంగా చర్చించింది. ఈ పథకానికి కేంద్రం అనుమతులు ఇవ్వాలంటూ సభ తీర్మానం చేసింది.

## మావోయిస్టు అగ్రనేత దేవా లొంగుబాటు..
# భారీగా ఆయుధాలు, నగదు స్వాధీనం: డీజీపీ

హైదరాబాద్: మావోయిస్టు అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా.. ఆ వివరాలను డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు చెప్పారు. "దేవా.. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75లక్షల రివార్డు ఉంది. ఆవులం సోమా, భేమే, సుశీల,





వేముల రాజు, నందయ్యా, మంకు, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారు. 2 lmg, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారు. ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయుధం కూడా ఉంది. ఎనిమిది ఏకే 47 గన్స్ స్వాదీనం చేసుకున్నాం. SLR 8, నాలుగు బ్యారెల్ గ్రానైడ్ లాంచర్స్ ఆయుధాలను సమర్పించారు. హెలికాప్టర్‌ను సైతం కూల్చే భారీ ఆయుధం సైతం తీసుకు వచ్చారు. పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారు. పీఎల్‌జీఏ పూర్తిగా క్షీణించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో మావోయిస్టులు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. డివిజన్ సభ్యులకు రూ.5లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4లక్షలు, మిగతా సభ్యులకు రూ.లక్ష రివార్డు ఉంది. రూ.1.80 కోట్ల రివార్డు లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తాం. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తాం. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ సమాచారం ప్రకారం ప్రస్తుతం తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మిగిలి ఉన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని కోరుతున్నాం" అని డీజీపీ తెలిపారు.

# విజయ్, రాహుల్‌గాంధీ మిత్రులే: కాంగ్రెస్‌తో పొత్తుపై టీవీకే సంకేతాలు

రానున్న శాసనసభ ఎన్నికల్లో టీవీకే కాంగ్రెస్ కూటమి ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయని, ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేతలతో టీవీకే అధ్యక్షుడు విజయ్ చర్చిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి అన్నాడీఎంకే, భాజపా వంటి అగ్రపార్టీలు సైతం బహిరంగంగానే పిలుపునిస్తున్నప్పటికీ కాంగ్రెస్‌తో కూటమి ఏర్పాటుకే విజయ్ మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పొత్తుకు సంకేతాలు ఇచ్చారు. లౌకికవాదం, మతతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో టీవీకే, కాంగ్రెస్ పార్టీ విధానాలు ఒకే విధంగా ఉంటాయని ఆయన అన్నారు. ఆ కోణంలో చూస్తే తాము సహజ భాగస్వాములమని.. విజయ్, రాహుల్ గాంధీ కూడా మంచి మిత్రులని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, టీవీకే పొత్తుకు చాలా అవకాశాలు ఉన్నప్పటికీ.. ఇరువర్గాలు కొన్ని విషయాలపై





చర్చించాల్సిన అవసరం ఉందని ఫెలిక్స్ అన్నారు. ఈ ప్రతిష్టంభనకు తమిళనాడు కాంగ్రెస్ యూనిట్ కారణమని పేర్కొన్నారు. ఇక్కడి నేతలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీవీకేతో జట్టు కట్టడానికి వెనుకడుగు వేస్తున్నారని అన్నారు. ఇరుపార్టీలు పొత్తును ఏర్పాటు చేసుకోవడం వల్ల మైనారిటీ, భాజపా వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపాడుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే పొత్తుపై అధికారిక ప్రకటన ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.



## మహారాష్ట్ర పురపోరు.. పోలింగ్‌కు ముందే మహాయుతికి 68 సీట్లు

మహారాష్ట్ర పురపోరులో.. అధికార ప్రభుత్వం విజయకేతనం ఎగురవేసింది. పోలింగ్‌కు ముందే భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారు. దీంతో పలు స్థానాల్లో పోటీ లేకుండానే విజయం లభించింది. ఇందులో భాజపా 44, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన పార్టీకి 22, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ రెండు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఏకగ్రీవ విజయాలపై అధికార ప్రభుత్వం ఆనందం వ్యక్తంచేసింది. ఈ విజయాలపై శివసేన పార్టీ (ఉద్ధవ్ ఠాక్రే) స్పందిస్తూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి కేంద్ర సంస్థలను అడ్డుగా పెట్టుకొని ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించడం, లంచం ఇవ్వడంతో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కారని ఆరోపించింది. ఇక, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

## రోడ్డు విస్తరణలో.. మా మామ ఇంటినే తొలగించాం: నితిన్ గడ్కరీ

పని విషయంలో తనకు అందరూ సమానమేనని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గతంలో ఒకసారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు అడ్డుగా ఉన్న తన సొంత మామ ఇంటినే తొలగించినట్టు వెల్లడించారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫరా తన కుక్ దిలీప్‌తో కలిసి దిల్లీలోని గడ్కరీ నివాసాన్ని సందర్శించారు. ఈ క్రమంలో గడ్కరీ తన సతీమణి కాంచన్‌తో కలిసి ఫరా ఖాన్ వ్లాగ్‌లో పాల్గొన్నారు. తమ గ్రామంలో రోడ్డు వేయాల్సిందిగా ఫరా ఖాన్ కుక్ దిలీప్ వ్లాగ్‌లో గడ్కరీని అభ్యర్థించాడు. దీంతో అతడి ఇంటి మీదుగా రోడ్డు వేయాలని ఫరాఖాన్ చమత్కరించారు. అక్కడే ఉన్న మంత్రి సతీమణి కాంచన్ మాట్లాడుతూ ఒక ఘటనను వెల్లడించారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని తన తండ్రి ఇంటినే కూల్చేశారని పేర్కొనడంతో అక్కడి వారు ఆశ్చర్యపోయారు.



దీనిపై నితిన్ గడ్కరీ వివరణ ఇస్తూ.. గతంలో రోడ్డు విస్తరణ పనుల్లో సొంత మామ ఇంటినే కూల్చివేసినట్లు తెలిపారు. మరి తర్వాత కొత్త ఇల్లు కట్టించారా అని ఫరాఖాన్ అడగగా.. ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి అందించే పరిహారం మాత్రమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్లాగ్‌లో తన జీవితంలోని పలు ఆసక్తికరమైన విషయాలను కూడా కేంద్రమంత్రి పంచుకున్నారు.

## నరాలు చచ్చుపడినా.. న్యూరాలింక్‌తో రిపేర్ సాధ్యమే: మస్క్

మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చే ప్రయోగాలను ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన బ్రెయిన్‌ఇంటర్‌ఫేస్ కంపెనీ న్యూరాలింక్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురికి ఆ చిప్‌ను అమర్చారు. దీనిద్వారా శరీర పనితీరును పూర్తిగా పునరుద్ధరించడం సాధ్యమవుతుందని తాజాగా మస్క్ విశ్వాసం వ్యక్తంచేశారు. మెడ, వెన్నెముకలో నరాలు చచ్చుపడినా నయం చేయడం సాధ్యమేనని వెల్లడించారు. కార్టెక్స్ (మెదడులో ఆలోచన, జ్ఞాపకశక్తి నిమగ్నమై ఉండే ప్రాంతం) నుంచి కమ్యూనికేషన్లను అనుసంధానించడానికి ఈ చిప్ సహాయపడుతుందని చెప్పారు. అలాగే పుట్టుకతోనే చూడలేనివారికి చూపును తీసుకువచ్చేలా తమ సంస్థ ప్రయోగాలు వేగంగా సాగుతున్నాయని ఇప్పటికే వెల్లడించారు. 2026లో మనుషులపై ఆ దిశగా ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. ఆ చిప్‌నకు బ్లైండ్ సైట్ అని పేరు పెట్టారు. మన మెదడు.. శరీరంలోని వివిధ అవయవాలకు నాడీ కణాల (న్యూరాన్లు) ద్వారా సంకేతాలను పంపడం, అందుకోవడం చేస్తుంది. ఈ కణాలు పరస్పరం అనుసంధానమై, ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తాయి. న్యూరో ట్రాన్స్‌మిటర్లు అనే రసాయన సంకేతాలతో ఇవి కమ్యూనికేషన్ సాగిస్తాయి. ఈ ప్రక్రియలో విద్యుత్ క్షేత్రం ఏర్పడుతుంది. మెదడులోని పలు న్యూరాన్లకు సమీపంలో ఎలక్ట్రోడ్లను



ఉంచడం ద్వారా వాటిలోని విద్యుత్ సంకేతాలను రికార్డు చేయడం 'న్యూరాలింక్' ప్రాజెక్టు ఉద్దేశం. తద్వారా వాటిని ఆధునిక యంత్రాల నియంత్రణకు ఉపయోగించాలని ఆ సంస్థ భావిస్తోంది. సూటిగా చెప్పాలంటే మెదడులోని ఆలోచన శక్తి సాయంతో మనం యంత్రాలతో అనుసంధానం కావొచ్చు. అలాగే నాడీ, కదలికలకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేయవచ్చు.

## ఫోన్లు దొంగిలిస్తున్నాడని.. 12 ఏళ్ల కొడుకును గొలుసులతో బంధించి..!

ప్రవర్తన సరిగాలేని తమ కొడుకు విషయంలో ఆ తల్లిదండ్రులు అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. అతడి ప్రవర్తనతో ఇతరులకు ఇబ్బంది కలగకూడదని తమ 12ఏళ్ల కొడుకుని గొలుసులతో కట్టేసి రెండు నెలలపాటు ఇంట్లో బంధించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. నాగ్‌పూర్‌లోని ఓ ఇంట్లో రెండు నెలలుగా బాలుడిని అతడి తల్లిదండ్రులు గొలుసులతో బంధించినట్లు ఇటీవల చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న శిశు సంక్షేమ కేంద్ర అధికారులు ఆ బాలుడిని గొలుసుల నుంచి విడిపించి





సంక్షేమ కేంద్రానికి తరలించారు. అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడు తరచూ ఇంటి నుంచి పారిపోతుండడం, ఫోన్లు దొంగిలిస్తుండడం, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తుండటంతో ప్రవర్తన మార్చుకోవాలని అతడి తల్లిదండ్రులు పలుమార్లు చెప్పారు. అయినా బాలుడు వారి మాటలు వినకపోవడంతో.. విసిగిపోయిన తల్లిదండ్రులు తమ కుమారుడిని ఇంట్లోనే బంధించి కూలి పనులకు వెళ్లేవారు. ఇలా రెండు నెలలుగా బంధించి ఉంచడంతో అతడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయని.. దీంతో బాలుడు తీవ్ర భయాందోళనకు గురయ్యాడని తెలిపారు. ప్రస్తుతం అతడిని మానసిక వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా కూలి పనులు చేసుకొని బతికే తాము పని చేయకపోతే పూట గడవదని బాలుడి తల్లిదండ్రులు వాపోయారు. దీంతో తమ కుమారుడి చర్యలను ఎప్పుడూ కనిపెట్టుకొని ఉండడం సాధ్యం కావట్లేదన్నారు. చేసేదేం లేక పనులకు వెళ్లే సమయంలో తమ కుమారుడిని గొలుసులతో ఇంట్లోనే బంధించి వెళ్తున్నామని పేర్కొన్నారు.

## ర్యాగింగ్, లైంగిక వేధింపులతో విద్యార్థిని మృతి.. యూజీసీ సీరియస్

సీనియర్ల ర్యాగింగ్, ప్రొఫెసర్ లైంగిక వేధింపుల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ విద్యార్థిని మృతి చెందడంపై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ ఘటనను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీవ్రంగా పరిగణించింది. ఈ కేసుపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని ఆదేశించింది. ఇందుకుగాను ఒక నిజ నిర్ధరణ కమిటీని ఏర్పాటుచేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ధర్మశాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషాదకర ఘటనను తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని యూజీసీ సీనియర్ అధికారి తెలిపారు. ర్యాగింగ్ వల్లే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందనే మీడియా నివేదికల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అయితే, విద్యార్థినిది ఆత్మహత్య కాదని.. సాధారణ మరణం అని కళాశాల అధికారులు పేర్కొన్నట్లు వివరించారు. ఈ ఘటనపై పోలీసు విచారణ కొనసాగుతోందని.. యూజీసీ ఒక నిజ నిర్ధరణ




కమిటీని ఏర్పాటుచేసిందన్నారు. దోషులను వదిలిపెట్టమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమన్నారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న బాధితురాలిపై ముగ్గురు సీనియర్ విద్యార్థినులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆమెపై దాడి చేశారు. మరోవైపు ప్రొఫెసర్ అశోక్‌కుమార్ ఆ విద్యార్థినిని లైంగికంగా వేధించేవాడు. దాడిలో గాయపడిన బాధితురాలు చికిత్స పొందుతూ.. డిసెంబరు 26న ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులను, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## రేహాన్ ఎంగేజ్‌మెంట్.. ధ్రువీకరించిన ప్రియాంక గాంధీ



కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రాల కుమారుడు రేహాన్ వాద్రాకు ఎంగేజ్‌మెంట్ జరిగినట్లు ఇటీవల జాతీయ మీడియాలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ తాజాగా ప్రియాంక గాంధీ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. రేహాన్, తను పెళ్లి చేసుకోబోయే అవీవా బేగ్‌లు చిన్నప్పటినుంచి మంచి స్నేహితులని తెలిపారు. వారి ఫొటోలను కూడా పంచుకున్నారు. రేహాన్ తన ఎంగేజ్‌మెంట్ ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్నారు. అందులో అవీవాబేగ్‌తో కలిసి ఉన్న చిన్ననాటి ఫొటో కూడా ఉంది. రాజస్థాన్ రణతంబోర్‌లో అత్యంత సన్నిహిత కుటుంబసభ్యుల సమక్షంలో ఈ వేడుక జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గత ఏడేళ్ల నుంచి రేహాన్, అవీవాలు ప్రేమలో ఉన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. రేహాన్ గతవారం పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా.. దానికి ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. మరికొన్ని నెలల్లోనే వీరి వివాహం కూడా జరగనున్నట్లు సమాచారం. రేహాన్ వాద్రా విజువల్ ఆర్టిస్ట్. వైల్డ్‌లైఫ్, స్ట్రీట్, కమర్షియల్ ఫొటోగ్రఫీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అవీవా కూడా ఫొటోగ్రాఫర్. ఓ ఫొటోగ్రఫిక్ స్టూడియో, ప్రొడక్షన్ కంపెనీకి సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

## వెనెజువెలా అధ్యక్షుడు మదురో మా కస్టడీలోనే: ట్రంప్

అమెరికా వెనెజువెలా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. యూఎస్ సైన్యం శనివారం తెల్లవారుజామున వెనెజువెలా రాజధాని కరాకస్‌పై భీకరదాడులు జరిపిన సంగతి తెలిసిందే. వాటిని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ధ్రువీకరించారు. అలాగే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి తమ కస్టడీలో ఉన్నారని వెల్లడించారు. వారిద్దరిని వెనెజువెలా వెలుపలకు తరలించినట్లు వెల్లడించారు. దీనిపై అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నామని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా



ట్రంప్ పోస్టు చేశారు. అమెరికా సైన్యానికి చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్‌లో భాగమైంది.

*** వారి ఆధారాలు ఇవ్వండి: ఉపాధ్యక్షుడు**

తమ అధ్యక్షుడిని అమెరికా కస్టడీలోకి తీసుకోవడంపై వెనెజువెలా ఉపాధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ స్పందించారు. మదురో, ఆయన సతీమణి ఇప్పుడు ఎక్కడున్నారో తమకు తెలియదని చెప్పారు. వారు సజీవంగా ఉన్నారని తెలియజేసేలా ఆధారాలు ఇవ్వాలని అమెరికాను డిమాండ్ చేశారు. 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికన్ దేశంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే తొలిసారి. ఆ ఏడాది పనామాపై దాడిచేసి, మిలిటరీ నేత మాన్యుయెల్ నోరిగాను పదవీచ్యుతుడిని చేసింది. ఈ పరిణామాల వేళ వెనెజువెలా పక్కదేశమైన కొలంబియా అప్రమత్తమైంది. ఆ దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

*** ఇక సైనిక దాడులు చేయబోం: అమెరికా**

మదురో అమెరికా (USA) కస్టడీకి చిక్కడంతో వెనెజువెలాలో తమ సైనిక చర్య పూర్తయిందని యూఎస్ సెనెటర్ మైక్ లీ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అమెరికా ఈ దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే తమ చమురు కోసమే అమెరికా దాడులు చేయనుందని గతంలో వెనెజువెలా ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా.. గతంలోనే తాను దేశాన్ని వీడేందుకు సిద్ధమని మదురో చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి.

# ఇంటి అందాన్ని పెంచే పూలమొక్కలు... నీడ, నీరు పెద్దగా అవసరం లేదు..!

మొక్కలు పెంచాలంటే చాలా ఓపిక కావాలని అందరూ అనుకుంటారు. అందుకే చాలా మంది అవకాశం ఉన్నా మొక్కలు నాటరు. అయితే చాలా తక్కువ సంరక్షణ అవసరమయ్యే మొక్కలు కొన్ని ఉన్నాయి. ఇవి సూర్యరశ్మిలో కూడా వృద్ధి చెందుతాయి. అంతేకాదు వేసవిలో కూడా అద్భుతంగా పెరుగుతాయి. అవి చాలా నీడలో మరియు తేమతో కూడిన వాతావరణంలో వికసించవు.. అలాంటి మొక్కలు ఏవో ఇప్పుడు మనం తెలుసుకుందాం.











బంతి పువ్వు, పొద్దుతిరుగుడు, చామంతులు, మల్లెలు, పెటునియాలు గులాబీ



# సపోటా పండ్లు ఎందుకు తినాలో తెలుసా?

**సపోటా పండ్లు. ఈ పండ్లలో విటమిన్ ఎ, బి, సి పుష్కలంగా ఉన్నాయి. అలాగే సపోటా జ్యూస్‌లో కాపర్, నియాసిన్, ఐరన్, క్యాల్షియం, ఫాస్పరస్‌లు అధికంగా ఉన్నాయి. సపోటా రసం తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము.**

సపోటాలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు గ్యాస్ట్రిక్, కడుపులో సమస్యలను నివారిస్తుంది.

సపోటా జ్యూస్ ఎఫెక్టివ్ జ్యూస్, ఇది నాడీ వ్యవస్థను రిలాక్స్ చేస్తుంది, స్ట్రెస్ తగ్గిస్తుంది.

సపోటా జ్యూస్‌లో ఉండే క్యాల్షియం ఎముకలను బలంగా మార్చుతుంది. గర్భిణీలకు శక్తినిస్తుంది.

సపోటా జ్యూస్‌లో విటమిన్ సి వుండటం వల్ల అది వ్యాధినిరోధకత పెంచడంలో సహాయపడుతుంది.

సపోటా జ్యూస్ తాగడం వల్ల వైరల్, బ్యాక్టీరియల్, ఇంటర్నల్ ఆర్గాన్ సిస్టమ్‌లో ప్యారాసిస్టిక్ ఎఫెక్ట్స్‌ను తొలగిస్తుంది. జ్యూస్‌లో ఉండే విటమిన్ ఎ లంగ్స్, సర్వికల్ క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది.

సపోటా జ్యూస్‌లో ఫ్రక్టోజ్ సుక్రోజ్‌లు అధికంగా ఉన్నాయి. ఇవి ఎనర్జీని అందిస్తాయి. సపోటా జ్యూస్ తాగడం వల్ల బ్లడ్ సర్క్యులేషన్ మెరుగుపడుతుంది.



# అందం కోసం.. వారానికోసారి!

రోజూ అందం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే సమయం ఉండకపోవచ్చు. కానీ వారానికి ఒక్కసారైనా ఈ విషయాలపై కొంత సమయం కేటాయించాలం టున్నారు నిపుణులు.



* వారానికి ఒక్కసారైనా హెర్బల్ నూనెలతో శరీరానికి మర్దన చేసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.
* తీరిక దొరికినప్పుడల్లా ముఖంలో పేరుకున్న మృతకణాలను తొలగించుకునేందుకు స్క్రబ్ చేసుకుంటాం. అలానే వారానికోసారైనా శరీరం మొత్తానికి అంటే.. వీపు, మెడ, కాళ్లకు కూడా స్క్రబ్ అవసరం. డీప్ క్లెన్సింగ్ మిల్క్‌ని అందుకోసం ఉపయోగించచ్చు. పాలు, పంచదార వంటి.. సహజసిద్ధమైన పదార్థాలనూ వాడచ్చు.
* చర్మంపై మృతకణాలు పోయి నిగారింపు రావాలంటే కనీసం అప్పుడప్పుడు ముఖానికి ఫేషియల్ అవసరం. అలాగని పార్లర్‌కే వెళ్లాలని లేదు. ఇంట్లో పండ్ల గుజ్జుతో కూడా ప్యాక్‌లు వేసుకోవచ్చు. తద్వారా ట్యాన్ పోయి ముఖం తాజాగా కనిపిస్తుంది.

# ఈ ఏడాది కూడా బంగారం, వెండికి తిరుగులేదు...

**భారీగా పెరగనున్న ధరలు!**

**2025లో భారీ లాభాలిచ్చిన బంగారం, వెండి**

**2026లోనూ ఈ జోరు కొనసాగుతుందని నిపుణుల అంచనా**

**బంగారం ధర ఔన్సుకు 5,000 డాలర్లకు చేరే అవకాశం**

**వెండి ధర ఔన్సుకు 85 డాలర్లకు పెరిగే సూచనలు**

**సహజ వజ్రాల కన్నా కృత్రిమ వజ్రాలకు పెరుగుతున్న డిమాండ్**



**న్యూఢిల్లీ:** గత సంవత్సరం 2025లో బంగారం, వెండిలో పెట్టుబడులు పెట్టిన వారికి కాసుల వర్షం కురిసింది. బంగారం సుమారు 65 శాతం లాభాలను అందించగా, వెండి ఏకంగా 140 శాతానికి పైగా లాభాలను ఇచ్చి చరిత్రాత్మకంగా నిలిచింది. ఇదే సానుకూల ధోరణి 2026లోనూ కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ గుజరాత్ అధ్యక్షుడు నైనేష్ పచ్చిగర్, ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది కూడా బంగారం, వెండి జోరు కొనసాగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

బంగారం ధరల భవిష్యత్తుపై వివరిస్తూ, "ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ఔన్సుకు 4,300 డాలర్ల వద్ద ఉంది. ఇది 5,000 డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉంది" అని పచ్చిగర్ పేర్కొన్నారు. దీని ప్రకారం ప్రస్తుత ధరల నుంచి 16 శాతానికి పైగా పెరిగే ఆస్కారం ఉందని ఆయన తెలిపారు. వెండికి కూడా మంచి అవకాశాలు ఉన్నాయని, దాని ధర ప్రస్తుతమున్న 70 డాలర్ల నుంచి 85 డాలర్లకు పెరగవచ్చని అంచనా వేశారు. అంటే వెండిలో దాదాపు 20 శాతం అదనపు లాభాలకు వీలుందని సూచించారు.

మరోవైపు వజ్రాల మార్కెట్ గురించి మాట్లాడుతూ, తక్కువ ధరల కారణంగా సహజ వజ్రాల కంటే ల్యాబ్-గ్రోన్ డైమండ్స్‌కు (కృత్రిమ వజ్రాలకు) ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు. రాబోయే కొన్నేళ్లపాటు ఇదే ధోరణి కొనసాగవచ్చని, అయితే మూడు, నాలుగేళ్ల తర్వాత సహజ వజ్రాలకు తిరిగి డిమాండ్ పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రపంచవ్యాప్త అనిశ్చితి, అమెరికా టారిఫ్ ఆందోళనలు, ప్రధాన దేశాల మధ్య భౌగోళిక ఉద్రిక్తతలే 2025లో బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నువామా ప్రొఫెషనల్ క్లయింట్స్ గ్రూప్ కూడా మధ్యలో ధరల స్థిరీకరణ ఉన్నప్పటికీ ఈ రెండు లోహాల బుల్లిష్ ట్రెండ్ కొనసాగుతుందని అంచనా వేసింది.

# రష్యా నుంచి చమురు దిగుమతుల వివరాలు ఇవ్వండి

**రిఫైనరీలను అడిగిన కేంద్రం**




**న్యూఢిల్లీ:** అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి వారంపాటు చేసిన కొనుగోళ్ల వివరాలను ఇవ్వాలంటూ దేశ రిఫైనరీలను కేంద్రం అడిగినట్లు సమాచారం. అలాగే అమెరికా నుంచి చమురు దిగుమతుల వివరాలను కూడా అడిగినట్లు తెలుస్తోంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైన నేపథ్యంలో ఈ డేటా తీసుకుంటున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.

2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో, మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. దీనిపై అమెరికా, దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే భారత్‌పై 50 శాతం సుంకాలు వేసిన సంగతి తెలిసిందే. భారత్‌తో తన వాణిజ్య లోటును తగ్గించుకోవాలని చూస్తోన్న యూఎస్ఏ.. వాణిజ్య ఒప్పందం చర్చల్లో భాగంగా టారిఫ్‌ల ద్వారా భారత్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది.

ఈ పరిణామాల వేళ.. రష్యా, అమెరికా చమురు కొనుగోళ్లకు సంబంధించిన డేటాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ రిఫైనరీలను అడిగింది. ఈ సమాచారం ఇవ్వాలని పీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాతో చర్చల సమయంలో ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూసుకుంటుందని మీడియా కథనాలు పేర్కొన్నాయి.

ఇదిలాఉంటే.. డిసెంబరులో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు గణనీయంగా తగ్గాయి. దిగుమతులపై మన విధాన నిర్ణయాల్లో మార్పులేమీ రాలేదని, స్వల్పకాలిక అంతరాయాల వల్లే రష్యా నుంచి చమురు దిగుమతి తగ్గిందని చెబుతున్నారు. 2022 డిసెంబరు తర్వాత రష్యా నుంచి ఇంత తక్కువగా చమురు దిగుమతి కావడం ఈ నెలలోనే. 'రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై ఆంక్షల నేపథ్యంలో డిసెంబరులో రష్యా నుంచి చమురు దిగుమతులు భారీగా తగ్గాయి. ఇది స్వల్పకాల సర్దుబాటుగా కనిపిస్తోంది. కొత్త ఇంటర్‌మీడియరీలు రావడం, సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ కారణంగా 2026 జనవరి నుంచి మళ్లీ దిగుమతులు పెరిగే అవకాశం ఉంది' అని రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ (రిఫైనింగ్-మోడలింగ్) సుమిత్ రిటోలియా పేర్కొన్నారు.

# ఎయిర్, వాటర్ ప్యూరిఫయర్‌లపై 'జీఎస్‌టీ' కోత!

**15 రోజుల్లో మండలి సమావేశంలో నిర్ణయం**




**న్యూఢిల్లీ:** దేశంలో కాలుష్య ఇబ్బందులు పెరుగుతున్న నేపథ్యంలో.. కోర్టు సూచనల మేరకు వాటర్, ఎయిర్ ప్యూరిఫయర్‌లపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ని 18% నుంచి 5 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదనను పరిశీలించడానికి కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్న జీఎస్‌టీ మండలి వచ్చే 15 రోజుల్లోగా సమావేశమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దిల్లీతో పాటు పలు నగరాల్లో వాయు కాలుష్యం కారణంగా ప్రజారోగ్యానికి చేటు వాటిల్లుతోందనే ఆందోళనలు, కోర్టుల జోక్యం, పరిశ్రమ, రాజకీయ నాయకుల డిమాండ్ నేపథ్యంలో పన్నుల తగ్గింపును ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుంది. ఇప్పటివరకు త్రైమాసికానికి ఒకసారి జీఎస్‌టీ మండలి సమావేశమవుతోంది. ఇంతకు ముందు చివరిసారిగా సెప్టెంబరులో మండలి సమావేశం జరిగింది. ప్యూరిఫయర్‌లపై పన్ను తగ్గింపునకు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల మధ్య ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ఉత్పత్తులను అత్యవసర వస్తువులుగా వర్గీకరించి, జీఎస్‌టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది.

గృహ అవసరాల కోసం వినియోగించే కొన్ని పురుగుమందులు, ఎలుకలను చంపడానికి వాడే ఉత్పత్తులపై జీఎస్‌టీని తగ్గించడంపైనా మండలి చర్చించనుంది. వీటిపై ప్రస్తుతం 18% జీఎస్‌టీ ఉంది. ఈ ఉత్పత్తులను కూడా 5% శ్లాబ్‌కు మార్చొచ్చని అంటున్నారు.

# వన్డే సిరీస్‌కు ఎంపికైన పంత్, అయ్యర్..




**సిరాజ్‌కు పిలుపు..!**

**న్యూఢిల్లీ:** వచ్చే వన్డే ప్రపంచకప్ సన్నద్ధతలో భాగంగా న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. రెగ్యులర్ సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ప్లీహం గాయం నుంచి కోలుకున్న శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. రెండో వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌కు చోటు దక్కింది. అయితే.. దేశవాళీలో వికెట్ల వేట కొనసాగిస్తున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీని అజిత్ అగార్కర్ బృందం మరోసారి పక్కన పెట్టేసింది.

స్వదేశంలో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన టీమిండియా కొత్త ఏడాది తొలి సిరీస్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. కివీస్‌తో జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. దాంతో.. ఈ సిరీస్ కోసం శనివారం సెలెక్టర్లు శుభ్‌మన్ గిల్ సారథిగా స్క్వాడ్‌ను ప్రకటించారు. ఆస్ట్రేలియా, సఫారీలపై .. దేశవాళీలోనూ దంచేసిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను కొనసాగించిన సెలెక్టర్లు.. గాయం నుంచి కోలుకున్న శ్రేయస్ అయ్యర్‌ను తిరిగి తీసుకున్నారు. రెండో వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌ను ఎంపిక చేశారు.

భారత స్క్వాడ్ : శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, హర్షిత్ రానా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్.

విశాఖ వన్డేలో శతకం బాదిన యశస్వీ జైస్వాల్‌కు బ్యాకప్ ఓపెనర్‌గా చోటు దక్కింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో సెంచరీతో మెరిసిన ఇషాన్ కిషన్, వికెట్లతో చెలరేగిన మహ్మద్ షమీలను మాత్రం పక్కన పెట్టేశారు. కివీస్‌తో పొట్టి సిరీస్ కూడా ఉన్నందున సీనియర్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. పేస్ బౌలింగ్ భారాన్ని ప్రసిధ్, హర్షి, అర్ష్‌దీప్ సింగ్‌లు మోయనుండగా.. స్పిన్నర్లుగా కుల్దీప్, సుందర్, జడేజాలు స్క్వాడ్‌లోకి వచ్చారు. భారత్, న్యూజిలాండ్ మధ్య జనవరి 11న వడోదరలో తొలి వన్డే, 14న రాజ్‌కోట్‌లో రెండో వన్డే, జనవరి 16న ఇండోర్‌లో మూడో వన్డే జరుగుతాయి. అనంతరం నాగ్‌పూర్ వేదికగా జనవరి 21 నుంచి టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది.

# ఐపీఎల్ నుంచి బంగ్లాదేశ్ పేసర్ ఔట్..




**ఢాకా:** బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనల ప్రభావం ఐపీఎల్ ఫ్రాంచైజీపై పడింది. ఇటీవలే మినీ వేలంలో భారీ ధరకు పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కొనుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌కు బీసీసీఐ కీలక ఆదేశాలిచ్చింది. బంగ్లాలో హిందువుల హత్యల నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ 19వ సీజన్‌లో ఆడించవద్దని కోల్‌కతాకు స్పష్టం చేసింది. వెంటనే ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను స్క్వాడ్ నుంచి తప్పించాలని షారుక్ ఖాన్ సహ యజమానిగా ఉన్న కేకేఆర్‌కు బీసీసీఐ అల్టిమేటం జారీ చేసింది.

ఐపీఎల్ 19వ సీజన్‌లో బంగ్లాదేశ్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఆడడంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. బంగ్లాలో హిందువులపై దాడులు, హత్యలను నిరసిస్తూ .. ఐపీఎల్‌లో ముస్తాఫిజుర్‌పై వేటు వేసింది బీసీసీఐ. 'ఇటీవల బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్న బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌కు చెందిన ముస్తాఫిజుర్‌ను స్క్వాడ్ నుంచి తప్పించాలని కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఆదేశించింది. అతడి స్థానంలో మరొకరిని తీసుకునేందుకు అనుమతిస్తామని కోల్‌కతాకు చెప్పింది' అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించాడు.

బంగ్లాదేశ్‌లో తాజాగా నెలకొన్న హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా ఆ దేశస్థుడైన ముస్తాఫిజుర్‌పై ఐపీఎల్‌లో వేటు వేయాలనే డిమాండ్లు వచ్చిన విషయం తెలిసిందే. ముస్తాఫిజుర్‌ను వేలంలో కొనడంపై ఈమధ్యే ఆధ్యాత్మిక గురువు దేవకీనందన్ థాకూర్ మండిపడ్డారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనలు జరుగుతున్నందున.. ఐపీఎల్‌లో ఆ దేశస్థుడిని ఆడించాలనకుంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్ సహ- యజమాని షారుక్ ఖాన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. దాంతో.. అతడిని ఐపీఎల్ నుంచి తప్పిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది.

డిసెంబర్ 19న అబుధాబీలో జరిగిన మినీ వేలంలో ముస్తాఫిజుర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.9.20 కోట్లకు కొన్నది. గతంలో పలు ఐపీఎల్ జట్లకు ఆడిన ముస్తాఫిజుర్ 60 మ్యాచుల్లో 65 వికెట్లు తీశాడు. చెన్నై సూపర్ కింగ్స్(2024), ఢిల్లీ క్యాపిటల్స్(2022-23), రాజస్థాన్ రాయల్స్(2021), ముంబై ఇండియన్స్(2018) వంటి ఫ్రాంచైజీల జెర్సీతో ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ బరిలోకి దిగాడు.

# న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన..

**శ్రేయస్‌కు చోటు..**



**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం త్వరలో భారత పర్యటనకు న్యూజిలాండ్ రానుంది. జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్, 21 నుంచి టీ20 సిరీస్ మొదలుకానున్నాయి. కివీస్‌తో వన్డే మ్యాచ్‌ల కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శనివారం జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌కు టీమ్‌లో చోటు కల్పించారు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే అతను మ్యాచ్‌లు ఆడతాడు. ఒక మ్యాచ్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేయడానికి హార్దిక్ పాండ్యకు నుంచి క్లియరెన్స్ రాకపోవడం, టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని కివీస్‌తో వన్డేలకు అతడికి విశ్రాంతి ఇచ్చారు. రిషభ్ పంత్, యశస్వి జైస్వాల్‌ను జట్టులో కొనసాగించారు. రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేయకపోవడం ఆశ్చర్యం కలిగించే అంశం. దేశవాళీల్లో సత్తా చాటుకున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమికి మరోసారి నిరాశే ఎదురైంది. వన్డే సిరీస్ తర్వాత జరిగే టీ20లకు భారత జట్టును ఇప్పటికే ఎంపిక చేశారు. వచ్చే నెలలో ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన జట్టునే ఆ సిరీస్‌లో కొనసాగించనున్నారు.

కివీస్‌తో వన్డేలకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ (వైస్‌కెప్టెన్‌లి), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్, రిషభ్ పంత్, నితీశ్‌కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

# ఒకే ఓవర్లో ఐదు సిక్సులు...

**విజయ్ హజారే ట్రోఫీలో తొలి సెంచరీ సాధించిన పాండ్యా**

**విజయ్ హజారే ట్రోఫీలో హార్దిక్ పాండ్యా విధ్వంసక శతకం**

**ఒక ఓవర్లో 5 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 34 పరుగులు రాబట్టిన పాండ్యా**

**కష్టాల్లో ఉన్న బరోడాను ఆదుకున్న పాండ్యా ... 92 బంతుల్లో 133 పరుగులు**

**పాండ్యా మెరుపులతో బరోడా జట్టు 293 పరుగుల భారీ స్కోరు**

**న్యూజిలాండ్ సిరీస్ జట్టు ఎంపికకు ముందు ఫామ్ చాటుకున్న హార్దిక్**



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా విదర్భతో జరిగిన మ్యాచ్‌లో బరోడా తరఫున ఆడిన పాండ్యా, తన కెరీర్‌లో తొలి లిస్ట్-ఏ సెంచరీతో చెలరేగిపోయాడు. శనివారం నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో హార్దిక్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అలరించాడు.

ఈ మ్యాచ్‌లో బరోడా జట్టు 20 ఓవర్లలో 71 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్, తొలుత ఆచితూచి ఆడుతూ 44 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. ఆ తర్వాత ఒక్కసారిగా గేరు మార్చి విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్స్ 39వ ఓవర్లో ఏకంగా 5 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 34 పరుగులు రాబట్టి కేవలం 68 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్నాడు.

మొత్తం 92 బంతులు ఎదుర్కొన్న పాండ్యా, 11 భారీ సిక్సర్లు, 8 ఫోర్లతో 133 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడి అదుతే ఇన్నింగ్స్ కారణంగా బరోడా జట్టు 50 ఓవర్లలో 293 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. పాండ్యా మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 4 వికెట్లతో రాణించాడు.

గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యా అదుతేమైన ఫామ్‌లో ఉన్నాడు. ఈ సీజన్‌లో బరోడా తరఫున ఇదే అతనికి తొలి మ్యాచ్. న్యూజిలాండ్ సిరీస్ కోసం భారత వన్డే జట్టును ఇవాళ ప్రకటించనున్న నేపథ్యంలో పాండ్యా సెంచరీ చేయడం టీమిండియాకు శుభవార్తగా మారింది.

## మన శంకరవరప్రసాద్ గారు
# పోస్టర్ విడుదల

**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి



కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.

# మీనాక్షి చౌదరితో..ప్రదీప్ రంగనాథన్ సైన్స్ ఫిక్షన్ సినిమా !

**టాకీస్:** తమిళ చిత్రం 'లవ్ టుడే' తో దర్శకుడిగా, నటుడిగా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు . యూత్ కు కనెక్ట్ అయ్యే కథలతో రావడంలో దిట్ట అయిన ప్రదీప్, ఈసారి ఒక ఇంట్రెస్టింగ్ సైన్స్ ఫిక్షన్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా టాలీవుడ్ క్రేజీ బ్యూటీ మీనాక్షి చౌదరి నటించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం సౌత్ ఇండియాలో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న మీనాక్షికి, ప్రదీప్ సరసన నటిస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక స్పెషల్ మైలురాయిగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రదీప్ మార్క్ కామెడీతో పాటు విభిన్నమైన సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ ఈ కథలో ఉండబోతుండటంతో ప్రాజెక్ట్‌పై అప్పుడే ఆసక్తి మొదలైంది.ప్రదీప్రంగనాథన్ స్వయంగా దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం, ఆయన గత సినిమాలకు పూర్తి భిన్నంగా ఉండబోతోందని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తి కాగా, మార్చి నెలలో షూటింగ్‌ను పట్టాలెక్కించడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. అంతే కాదు.. ఈ సినిమాను ఎక్కువ రోజులు కాకుండా, ఒకే షెడ్యూల్‌లో వేగంగా షూటింగ్ పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ప్రదీప్ తన సినిమాల్లో ముందు నుండి కూడా ప్రజంట్ జనరేషన్‌కి కనెక్ట్ అయ్యేలా కథను తీర్చిదిద్దుతాడు, మరి మీనాక్షితో కలిసి ఆయన చేసే ఈ మ్యాజిక్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్‌లో సక్సెస్ అవుతుందో చూడాలి. ఈ ఇద్దరి క్రేజీ కాంబో గురించి అధికారిక ప్రకటన వెలువడితే, ఇక ఫ్యాన్స్‌కి పండగే అని చెప్పవచ్చు.




## రజనీతో కమల్ మూవీ
### డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి

**టాకీస్:** అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది.



'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.

## చైతన్యరావు దిల్ దియా
# మూవీ పోస్టర్ విడుదల

**టాకీస్:** కీడా కోలా, ఘాటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో చైతన్య రావు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు కె. క్రాంతి మాధవ్ కాంబినేషన్‌లో ఒక నూతన చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు 'దిల్ దియా' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చైతన్య సోఫాలో నగ్నంగా కూర్చోవడం చాలా విభిన్నంగా అనిపిస్తుంది. ఈ సినిమా థీమ్‌ను ప్రతిబింబించేలా ఫస్ట్ లుక్ ఉండటంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చైతన్య రావు ఈ సినిమాలో గత చిత్రాల కంటే భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటం విశేషం. శ్రియాస్ చిత్రాస్, ఎ.పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. క్రాంతి మాధవ్ మార్క్ ఎమోషన్స్, చైతన్య రావు నటన ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.



# 'వామ్మో వాయ్యో' సాంగ్ రిలీజ్..
### సంక్రాంతి స్పెషల్ మాస్ బీట్ రెడీ

టాకీస్: రవితేజ హీరోగా కిశోర్ తిరుమల డైరెక్షన్ లో రూపొందించిన మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్స్ గా.. ఈ సినిమా సంక్రాంతి బరిలో ఉంది. ఈనెల 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నాడు వరంగల్‌లో ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. ''వామ్మో వాయ్యో'' అంటూ సాగిన ఈ జానపద పాటకు భీమ్స్ సెసిరోలె స్వరాలు సమకూర్చగా.. దేవ్ పవార్ సాహిత్యం అందించారు. స్వాతి రెడ్డి పాటను ఆలపించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతులు అందించారు. ఈ పాటలో రవితేజ, ఆషికా, డింపుల్ వేసిన స్టెప్పులు అందరిని ఆకట్టుకుంటున్నాయి.
అయితే, ఈ సందర్భంగా డైరెక్టర్ కిశోర్ తిరుమల మాట్లాడుతూ.. ''ఇది ఆద్యంతం వినోదాత్మకంగా సాగే కుటుంబ కథా సినిమా.. కచ్చితంగా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. థియేటర్లకు వచ్చి ఈ చిత్రాన్ని ఆస్వాదించండి'' అన్నారు. ఇక, చాలా రోజుల తర్వాత 'వామ్మో వాయ్యో' లాంటి మాస్ పాట చేశా.. ఇది మాకెంతో ప్రత్యేకమైన సాంగ్ అని నటి డింపుల్ హయాతి చెప్పుకొచ్చింది. అలాగే, ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ.. థియేటర్లో ఈ పాట అందర్నీ అలరిస్తుంది. చాలా ఎనర్జీతో నిండిన మాస్ సాంగ్ ఇది.. ఈ పాట కోసం నేను.. డింపుల్ చాలా కష్టపడి డ్యాన్స్ చేశామని వెల్లడించింది.




**టాకీస్:** ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలు కావాలనుకుని ఇండస్ట్రీక్రి వచ్చి దర్శకులుగా స్థిరపడినవారు ఉన్నట్లే, దర్శకత్వ రంగంలోకి వచ్చి హీరోలుగా మారిన ఉదాహరణలూ ఉన్నాయి. నాని, రాజ్ తరుణ్ లాంటి వారు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేసి తర్వాత హీరోలుగా సక్సెస్ సాధించారు. మరోవైపు కొందరు సక్సెస్‌ఫుల్ దర్శకులు కూడా హీరోగా మారాలని ప్రయత్నించి ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో వరుస హిట్లతో దూసుకెళ్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి హీరోగా మారతారా? అన్న ప్రశ్న తరచూ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన స్టేజ్‌పై మాట్లాడే తీరు, కామెడీ టైమింగ్, మాస్ పల్స్ చూసి 'హీరో మెటీరియల్' అంటూ అభిమానులు కామెంట్స్ చేయడం కొత్త కాదు. అయితే ఈ విషయంపై అనిల్ రావిపూడి ఇచ్చిన సమాధానం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హీరోగా సినిమా చేయొచ్చుకదా అని అడిగినప్పుడు అనిల్ రావిపూడి చాలా మెచ్యూర్డ్‌గా స్పందించారు. మనమొక క్రాఫ్ట్‌లో టాప్‌లో ఉన్నప్పుడు పక్కదారి పట్టించడానికి ఇలాంటి ప్రలోభాలు వస్తాయి. వాటికి లొంగితే

## నటనపై ఆసక్తి లేదన్న దర్శకుడు
### అలాంటి గ్రాఫ్‌లో పడనన్న అనిల్ రావిపూడి



ఇప్పటికే ఉన్న కెరీర్‌కే ప్రమాదం. అందుకే ఆ ట్రాప్‌లో నేను పడను. నాకు హీరోగా మారాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు. డైరెక్షన్‌పైనే పూర్తి దృష్టి పెడతాను అని ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తుంది. టాలీవుడ్‌లో దర్శకుడు రాజమౌళి తర్వాత ఫెయిల్యూర్ లేని ట్రాక్ రికార్డ్ ఉన్న డైరెక్టర్‌గా అనిల్ రావిపూడికి మంచి పేరు ఉంది. ఆ రికార్డును కాపాడుకోవడమే తన ప్రధాన లక్ష్యమని, నటన వైపు వెళ్లి ఫోకస్ డైవర్ట్ చేయాలనే ఆలోచన తనకు లేదని ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి పూర్తిగా మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాపైనే దృష్టి పెట్టారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.